ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 42.7 । కనిష్ఠం 27.4



'పది'లో ప్రతిభ చూపిన వారికి పురస్కారాలు

ఖానాపూర్, మే1: పదోతరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన ఖానాపూర్ మండల ప్రభుత్వపాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేస్తామని రాష్ట్రపతి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వాల్గోట్ కిషన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదివి అత్యధిక జీపీఏ పాయింట్లు సాధించిన విద్యార్థులు 25వ తేదీలోపు ఎస్‌ఎస్‌సీ మార్కుల ఆన్‌లైన్ మెమోను సెల్ నెంబర్ 9441728535కి వాట్సాప్ ద్వారా పంపించాలని కోరారు.



● ట్రిపుల్ ఐటీ ప్రధాన ప్రవేశ ద్వారం

» తప్పుకొన్న కాంట్రాక్టును.. అక్రమంగా కొనసాగిస్తున్న బినామీ అధికారులు
» నాలుగేళ్లుగా యూనివర్సిటీలో సూపర్ మార్కెట్ అక్రమదందా
» అధికారుల అండతో బినామీ ఉద్యోగుల ఇష్టారాజ్యం
» రూ. కోట్లలో వ్యాపారం » చర్యలకు అధికారుల వెనుకడుగు

ట్రిపుల్ ఐటీలో.. మాయాబజార్!



> **సూపర్‌మార్కెట్‌కు సంబంధించిన ఫైళ్లే లేవు..**
>
> ● వెంకటరమణ, వైస్‌చాన్సలర్
>
> సూపర్ మార్కెట్ విషయం మా దృష్టికి రాగానే అది ఎలా కేటాయించారో తెలుసుకునేందుకు ఫైళ్లు తెమ్మని సిబ్బందికి చెబితే లేవని చెప్పారు. లోతుగా వెతకగా ఒక పేపర్ లభించింది. దాన్ని చూసి సూపర్ మార్కెట్‌పై తదుపరి చర్యలు తీసుకుంటాం. అక్రమమని తేలితే మూసివేస్తాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. అద్దె కూడా పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది.

బాసర, మే.1: విద్యార్థులకు విద్యాబోధన అందించి వారి ప్రగతికి కృషిచేయాల్సిన అధికారులు తమసొంత ప్రగతికి పాటుపడుతున్నారు. పరిపాలనలో నిర్లక్ష్యం, నిధుల వినియోగంలో అక్రమాలు, విద్యార్థుల పట్ల నిర్లక్ష్యమేకాకుండా అధికారం ఉందని వ్యాపారాలకు తెరలేపారు. అడిగేవారు ఎవరున్నారు అనుకున్నారో ఏమో యూనివర్సిటీలో కొందరు ఉద్యోగులు బినామీ కాంట్రాక్టర్లుగా అవతారమెత్తారు. వీరికి అధికారుల అండదండలు తోడవ్వడంతో వీరుఆడిందే ఆటగా కొనసాగుతోంది. ఇందుకు నిదర్శనమే సూపర్‌మార్కెట్ దందా బాగోతం. ఒక కాంట్రాక్టును అర్హతలను నిర్ణయించి టెండరులో ఖరారు చేస్తే ఆసంస్థ ఆ కాంట్రాక్టు నుంచి తప్పుకుంటే సాధారణంగా అది రద్దు చేయాలి. తర్వాత టెండరు వేసి మరోసంస్థకు ఆ పని అప్పగించాలి లేదా ఎంపిక చేయాలి. బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో మాత్రం అధికారులు అలా చేయలేదు. ఇదే అవకాశంగా భావించి ఆ దందాలోకి అధికారులే బినామీలుగా దూరిపోయారు. తామేచేస్తే తెలిసిపోతుందని యూనివర్సిటీలో ఇతర కాంట్రాక్టులు పొందిన హైదరాబాద్‌కు చెందిన ఓ బడావ్యాపారికి ముందుంచి దందాను కొనసాగిస్తున్నారు. గతమూడేళ్ల నుంచి కొనసాగుతున్న అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదు అధికారులు మారినా ఇంకా ఈదందా కొనసాగుతుండడంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దందాలో అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతినెలా రూ.లక్షల్లో అందుతున్న మామూళ్లే పెద్ద పెద్ద అధికారులు ఉండే పరిపాలన భవనం ఎదుట ఉన్న సూపర్‌మార్కెట్ వ్యాపారం ఆగకుండా కొనసాగడానికి కారణంగా తెలుస్తోంది.

● చక్రం తిప్పిన బినామీ అధికారి

ఈఅక్రమ దందాకు ఇ-ప్రొక్యూర్‌మెంట్‌లో పనిచేసే అప్పటి ఉద్యోగి చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. యూనివర్సిటీలో ఈ సూపర్‌మార్కెట్ వ్యాపారాన్ని పసిగట్టిన ఆయన ఆలోచనతోనే టెండర్లు పిలిచారు. అన్నీ ఆయనకు అనుకూలంగా నిబంధనలు విధించుకున్నారు. అంతకుముందే నిబంధనలకు అనుకూలంగా ఉన్న వ్యాపారిని సిద్ధం చేసుకున్నారు. ఇక అధికారుల అండదండలు ఉండడంతో అనుకున్నట్టుగానే టెండరులో కాంట్రాక్టు వచ్చింది. ట్రిపుల్ ఐటీలో ఏ కాంట్రాక్టైనా టెండరులో ఒకటి లేదా రెండు మహా మూడేళ్ల కాలపరిమితితో టెండర్లు పిలుస్తారు. బినామీగా ఉన్న ఈ సూపర్‌మార్కెట్‌కు మాత్రం ఐదేళ్ల కాలపరిమితి మరోరెండేళ్లు పొడగింపు అవకాశంతో టెండరును దక్కించుకున్నారు. 9వేలమంది విద్యార్థులు, మరో 200మంది సిబ్బంది కుటుంబాలకు అవసరమైన సరుకులు కొనుగోలు చేయాలంటే యూనివర్సిటీలో ఉన్న ఈ ఒక్క సూపర్‌మార్కెట్‌యే దిక్కు. సూపర్‌మార్కెట్ అంటే నిత్యావసర సరుకులే కాదు ఇక్కడ గుండు సూది నుంచి బేకరీ వస్తువుల వరకు మార్కెట్‌లో దొరికే అన్ని కూరగాయలతో పాటుపండ్లు అన్నింటిని టెండరులో చేర్చారు. అంటే ముందు జాగ్రత్తగానే పెద్దఎత్తున వ్యాపారం నిర్వహించేందుకు అవకాశాలను అందులో పొందుపరిచారు. రూ.లక్షల్లో వచ్చే అద్దెను నెలకు రూ.50వేల అద్దెతో ఈకాంట్రాక్టును పొందారు.

● దందాలో బినామీలుగా అధికారులు

బినామీ ఉద్యోగి అనుకున్నట్లు ఈ కాంట్రాక్టు ఆయన అనుకూలమైన వారికే దక్కింది. కానీ కాంట్రాక్టు పొందిన నిజామాబాద్‌కు చెందిన పంచవటి సూపర్ మార్కెట్ నిర్వాహకులు రెండుమూడు నెలలే కొనసాగించి నిలిపివేశారు. అంతేగాకుండా అధికారులకు లిఖిత పూర్వకంగా ఈవ్యాపారం మేము కొనసాగించలేమని కాంట్రాక్టును రద్దుచేయాలని అధికారులకు తెలియజేశారు. కానీ అధికారులు మాత్రందాన్ని రద్దు చేయకుండా కొనసాగించడమే ఇక్కడ ప్రధాన అంశం. హైదరాబాద్‌కు చెందిన ట్రిపుల్‌ఐటీలో పనిచేసే కాంట్రాక్టర్ పేరు మీద ఈ దందా కొనసాగుతోంది. ఇందులో ముందునుంచి ఒకరు బినామీగా ఉన్న ట్రిపుల్‌ఐటీ ఉద్యోగుల్లో మరికొందరు కీలకమైన అధికారులు కూడా భాగస్వాములైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బినామీలు ఉండడం వలనే అధికారులు మారినా ఈ దందాపై చర్యలు తీసుకోకపోవడం ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తోంది. ఈ సూపర్‌మార్కెట్‌పై రెండేళ్ల నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ప్రస్తుతం ఉన్న యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదుచేశారు. అందులో అమ్ముతున్న ఎగ్‌పాప్‌లు, కరీపాప్‌ల వల్ల విద్యార్థులు వాటిని తిని అస్వస్థతకు గురైన సందర్భాలు ఉన్నాయి. దీంతో కొన్ని రోజుల నుంచి బేకరీ ఐటమ్స్‌ల విక్రయాన్ని అధికారులు నిలిపివేశారు కానీ అక్రమంగా కొనసాగుతున్న సూపర్‌మార్కెట్‌పై చర్యలు తీసుకోవడం లేదు.

● ఫైళ్లు మాయం..

సూపర్‌మార్కెట్ టెండరుసమయంలో నిర్వహించిన ఫైళ్లు ఇప్పుడు యూనివర్సిటీలో కనిపించకుండా పోయాయి. కాంట్రాక్టు సంస్థ తప్పుకోవడంతో చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉండకూడదనే నేపంతోనే ఎవరైనా ఇలాచేసి ఉండవచ్చుననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఫైళ్ల మాయమైనా ఘటనపై ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకోకపోవడం అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతినెలా అద్దెకూడా సరిగ్గా చెల్లించడం లేదన్నట్లు తెలిసింది.

> **మేము అప్పుడే తప్పుకున్నాం..**
>
> ● పంచవటి సంస్థ నిర్వాహకులు
>
> ట్రిపుల్ ఐటీలో వచ్చిన మా కాంట్రాక్టును మేము రద్దు చేసుకున్నాం. ఒకటి, రెండు నెలలు నడిపి కొన్ని ఇబ్బందులు తలెత్తడంతో వ్యాపారాన్ని కొనసాగించలేకపోయాం. కాంట్రాక్టును రద్దు చేయాలని లిఖితపూర్వకంగా మెయిల్ ద్వారా తెలియజేశాం. ట్రిపుల్ ఐటీలో మాకు ఎలాంటి వ్యాపారం లేదు.



ఆర్జీయూకేటీ క్యాంపస్



ట్రిపుల్ ఐటీలో పెద్దఎత్తున కొనసాగుతున్న సూపర్ మార్కెట్



సూపర్‌మార్కెట్ భవనం

సంక్షిప్త సమాచారం



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పల్సిలో మద్యం పట్టివేత

కుభీర్, మే1: మండలంలోని పల్సి గ్రామంలో బుధవారం నిల్వ చేసిన మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో తనిఖీలు చేస్తుండగా గ్రామంలోగల లక్ష్మసాయినాథ్‌కు సంబంధించిన బెల్టు షాపులో రూ.5096 విలువల గల 12.74 లీటర్‌ల మద్యం పట్టుకున్నట్లు తెలిపారు.

ఆలయంలో పోచమ్మ విగ్రహప్రతిష్ఠాపన

కుభీర్, మే1: మండలకేంద్రంలో బుధవారం పోచమ్మ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. బజార్ గల్లీ రోడ్డులో గల పోచమ్మ అమ్మవారి ఆలయాన్ని పునర్నిర్మించి బుధవారం ఆలయంలో పోచమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు పుప్పాల పీరాజీ, నిఖిల్, శంకర్‌సేట్, రాజుసేట్, తదితరులు ఉన్నారు.

'సుందరయ్య జీవితం ఆదర్శప్రాయం'

నిర్మల్ కల్చరల్, మే1: జిల్లాకేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బి. సుజాత, శైలజ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పుచ్చలపల్లి సుందరయ్య కీలకపాత్ర పోషించారన్నారు. నిరాడంబరతకు మారుపేరన్నారు. సైమన్ కమిషన్ బహిష్కరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం ఉద్యమంలో పాల్గొన్నారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించి సమస్యలు సాధించుకోవాలని పిలుపునిచ్చారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

మేడే స్ఫూర్తితో ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

● ఆయా కార్మిక, ఉద్యోగ సంఘాల నాయకులు



పతాకావిష్కరణ చేస్తున్న నాయకులు



మే డేను జరుపుకుంటున్న దృశ్యం



నినాదాలు చేస్తున్న యుటీఎఫ్ నాయకులు

నిర్మల్‌కల్చరల్, మే1: మేడే స్ఫూర్తితో ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ నాయకురాలు బి.సుజాత పిలుపునిచ్చారు. బుధవారం సీఐటీయూ కార్యాలయంలో 138వ మేడే వేడుకలను జెండా ఆవిష్కరించి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెట్టుబడిదారుల, పాలకవర్గాల దోపిడీ అణచివేతకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి హక్కులు సాధించుకోవాలన్నారు. అందరూ ఐక్యంగా ఉంటేనే సాధ్యమన్నారు. ఈసమావేశంలో ఎన్‌పీఆర్‌డీ అధ్యక్షుడు ఫసియుద్దీన్, నాయకులు శైజల, రాజశేఖర్, ప్రసాద్, ఆశావర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు చంద్రకళ, రమ, లక్ష్మి పాల్గొన్నారు.

యుటీఎఫ్ కార్యాలయంలో..

నిర్మల్‌కల్చరల్: నిర్మల్‌లోని యుటీఎఫ్ కార్యాలయంలో బుధవారం నాయకులు మే డే వేడుకలను నిర్వహించారు. పతాకావిష్కరణ చేసి ఉపాధ్యాయ, కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్, మనోహర్, శ్రీను, అనీల్ పాల్గొన్నారు.

కార్మిక హక్కుల కోసం పోరాటం చేయాలి

దస్తూరాబాద్: కార్మికుల హక్కుల కోసం ప్రతీ కార్మికుడు పోరాటం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లాఅధ్యక్షుడు సునారికారి రాజేష్ పిలుపునిచ్చారు. సోమవారం కార్మికుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో 138 మేడే జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ సర్కార్ తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగులేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్కీం వర్కర్లందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్‌చేశారు. కార్మిక హక్కుల రక్షణ కోసం పోరాటాలే మార్గమన్నారు. కార్మిక వ్యతిరేకవిధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో దుర్గం లింగన్న, నాయకురాలు కే. వెంకవ్వ, మద్దినేని చిన్న రాజన్న, గుజ్జుల గజ్జన్న, మేడి శంకర్, ఆకుల సత్తన్న, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

భైంసాలో..

భైంసా: పట్టణంలో బుధవారం మేడే సంబరాలు ఘనంగా జరిగాయి. మేడేను పురస్కరించుకొని ఆయాకార్మిక, ఉద్యోగ సంఘాల కార్యాలయంలో జెండా ఎగురవేసే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఖానాపూర్‌లో..

ఖానాపూర్: 'మేడే స్ఫూర్తిగా కార్మికుల హక్కుల సాధన కోసం ప్రతీ కార్మికుడు పోరాటం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజా పంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య అన్నారు. బుధవారం మే డేను పురస్కరించుకొని ఖానాపూర్ మండలంలో పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వేరు వేరుగా ఘనంగా ఎర్ర జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఖానాపూర్‌లో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేష్, మాస్‌లైన్ ఐఎఫ్‌టీయూ పట్టణ అధ్యక్షుడు సీతారాం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, తదితరులు మే డే జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ నంది రామయ్య మాట్లాడుతూ ప్రపంచ కార్మికవర్గానికి హక్కులు సాధించిపెట్టింది మే డే అన్నారు. కేంద్ర ప్రభుత్వరంగ పరిశ్రమలను మూసివేసిందని మోదీ పాలనలో సుప్రీంకోర్టు చెప్పినా కనీస వేతనాల చట్టం అమలు కాలేదన్నారు. మండలకేంద్రంతోపాటు మండలంలోని పాతతర్లపాడ్, తర్లపాడ్, సత్తనపల్లి, బీర్నంది, రంగపేట, తుమ్మగూడెం, జిల్లేడు కుంట, లింగుగూడ, చామన్‌పెల్లి, సోమర్‌పేట్, కోలం గూడ, దేవునిగూడెం, కొమ్ము తండా, బావాపూర్(కే), పాత ఎల్లాపూర్, నడింపల్లి, ఎస్సీ వాడ, మస్తాన్ ఎల్లాపూర్, తదితర గ్రామాల్లో మేడేను పురస్కరించుకుని ఎర్రజెండాలను ఎగురవేశారు. ఆయా గ్రామాల్లో వేరువేరుగా జరిగిన మేడే కార్యక్రమాల్లో కార్మికసంఘాల నాయకులు జక్కుల రాజన్న, ఎం. అంకుశరావు, కుంచెపు ఎల్లయ్య, అడగట్ల శంకర్, ఎం.శంకర్, ఆకుల సత్యన్న, ప్రసాద్, నాగెల్లి నర్సయ్య, ఎస్.నారాయణ, జాహెద్, గంగాధర్, కే.రాజన్న, భైరి మల్లేష్, మచ్చ శ్రీనివాస్, గోనె లచ్చన్న, సోమర్‌పేట్ నడిపన్న, సీడం సోనేరావు, భీమ్‌రావు, నాగరాజు, రమేష్, ఫాహిం, నర్సయ్య, అజీమ్, బాబా, రామ్ రవి, సలీం, భీమన్న, శ్రీకాంత్, పూసం లక్ష్మణ్ పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో జెండాను ఎగురవేస్తున్న నంది రామయ్య



ఖానాపూర్‌లో ఎర్ర జెండా ఎగురవేస్తున్న సీఐటీయూ నాయకులు



కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

● కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌రూరల్, మే1: వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం సోన్ మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలును పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, టెంటు వంటి సౌకర్యాలు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతుధరకే వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. వరి కొనుగోలుకు సంబధించిన వివరాలను కేంద్రం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు సరిపడా ధాన్యపు సంచులను, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద గల తూకపు యంత్రం, తేమ యంత్రాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేష్, అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'మోదీ ఫాసిస్టు పాలనను అంతమొందించాలి'

నిర్మల్‌కల్చరల్, మే1: దేశంలో కార్మికుల హక్కులు కాలరాస్తూ ప్రధాని మోదీ కొనసాగిస్తున్న ఫాసిస్టు పాలన అంతమొందించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్న పిలుపునిచ్చారు. బుధవారం నిర్వహించిన మే డే వేడుకల సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1886లో అమెరికా దేశంలోని చికాగో నగరంలో కార్మికవర్గం అధిక పని గంటలు తగ్గించాలని, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించిందన్నారు. ఈపోరాటంలో జరిపిన కాల్పుల్లో అనేకమంది కార్మికులు అసువులు బాసారన్నారు. అమరుల నెత్తుటికి సాక్షిగా మే1ని మేడేగా జరుపాలని ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక సంక్షేమ చట్టాలు 29 చట్టాలను కేంద్రం నాలుగు కోడ్‌లుగా మార్చిందని 15 చట్టాలు పూర్తిగా రద్దు చేశాయన్నారు. కార్మికవర్గం చైతన్యవంతులై మేడే స్ఫూర్తితో హక్కుల సాధనకు ఉద్యమించాలన్నారు. నాయకులు రామలక్ష్మణ్, బక్కన్న, గఫార్, కే. లక్ష్మి, గంగామణి, కిషన్, తదితరులు పాల్గొన్నారు.



మే డే నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే సంబరాలు

లక్ష్మణచాంద, మే1: మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మే సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సీఐటీయూ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మహిళా నాయకురాళ్లు లలిత, పెద్దమ్మ, ప్రేమల, రత్నమాల, శారద, విజయ, సరిత, రమ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కుంటాలలో..

కుంటాల: మండలంలో బుధవారం మేడేను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కార్మికుల జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీఐటీయూ డివిజన్ అధ్యక్షురాలు ఇంద్రమాల మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీలత, కోశాధికారి మమత, సభ్యులు లక్ష్మీ, దేవకి, ఉమ తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఎన్నికల నిర్వహణపై
సిబ్బంది అవగాహన ఉండాలి

● నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్ కల్చరల్, మే1: ఈనెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ అన్నారు. బుధవారం సెయింట్ థామస్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన రెండోవిడత శిక్షణ కార్యక్రమానికి హాజరై సిబ్బందికి సూచనలు చేశారు. ఎన్నికలకు ఒక్కరోజు ముందు సామగ్రి పంపిణీ కేంద్రాలకు చేరుకొని సామాగ్రి తీసుకోవాలన్నారు. తమకు కేటాయించిన కేంద్రాలకు సాయంత్రంలోగా చేరుకోవాలన్నారు. పోలింగ్ రోజున ఉదయం 5:30గంటలకు అన్ని రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో 50 ఓట్లకు మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. ప్రతీ రెండు గంటలకోసారి ఓటింగ్ శాతం వివరాలు సెక్టార్ అధికారులకు అందజేయాలన్నారు. 17సి ఫారం, పీవో డైరీ తదితర రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ఈవీఎంలలో సమస్యలుంటే అధికారుల అనుమతితోనే వాటిని మార్చాలని సూచించారు. ఎన్నికలు పూర్తైన తర్వాత జాగ్రత్తగా ఈవీఎంలను రిసెప్షన్‌కేంద్రాల్లో అందజేయాలన్నారు. వందశాతం వెబ్ కాస్టింగ్ చేయాలని ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. డీఈవో రవీందర్‌రెడ్డి, ఆర్డీవో రత్న కళ్యాణి, శిక్షణ నిర్వాహకులు పాల్గొన్నారు.

పట్టణంలో తాగునీటికి
ఇబ్బందులు లేకుండా చర్యలు

● ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యం

ఖానాపూర్, మే1: పట్టణంలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ ఆధ్వర్యంలో పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యం తెలిపారు. బుధవారం 6వ వార్డు పరిధిలోని బర్కత్‌పురా కాలనీలో తలెత్తిన తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. తాగునీటికి ఇబ్బందులు తలెత్తినట్లు కాలనీ వాసులు ఇటీవల ఆ వార్డు కౌన్సిలర్ ఆఫ్రిన్ బేగం అమానుల్లా ఖాన్ దృష్టికి తీసుకురాగా సమస్యను పరిశీలించి నూతన విద్యుత్ మోటార్‌ను అమర్చి సమస్యను పరిష్కరించినట్లు చైర్మన్ తెలిపారు. పట్టణంలో నీటి సమస్య తలెత్తితే ఆయాకాలనీలో కౌన్సిలర్లకు గానీ, మున్సిపల్ కార్యాలయంలో తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు యూసుఫ్ ఖాన్, షేక్ హైమద్, ఎంఏ జావిద్, వాహబ్, తురబ్, గమీ, సోయాబ్, జియా ఖాదర్, మహమ్మద్ జియా, అజార్, మజార్, జావిద్, తదితరులున్నారు.



మోటార్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

పీఎస్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

నర్సాపూర్(జి), మే1: మండలకేంద్రంలోని పోలీసుస్టేషన్‌ను ఎస్పీ డా. జానకి షర్మిల బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్ రికార్డులను, స్టేషన్ పరిసరాలను ఆమె పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని సిబ్బందికి ఆదేశించారు. బాధితులు న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు భయం లేకుండా, న్యాయం జరుగుతుందని భావించి ఫిర్యాదుఇచ్చేందుకు వచ్చేలా చూడాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమరాల ఏర్పాటుపై గ్రామస్థులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రిసెప్షన్, టెక్నికల్ రూంలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై మునిగెల హన్మాండ్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముథోల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

ముథోల్: ముథోల్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఎస్పీ జానకి షర్మిల తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కేసులకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటుచేసిన పచ్చదనంను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సలహా, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని అన్నిచెక్‌పోస్టులతోపాటు సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, సీఐలు మల్లేష్, రాజారెడ్డి, ఎస్సైలు సాయికిరణ్, మోహన్ రావు, పుష్పవతి, సిబ్బంది ఉన్నారు.

సీఎం మోదీతోనే అభివృద్ధి సాధ్యం: బీజేఎల్పీ నేత

సారంగాపూర్, మే1: ప్రధాని మోదీతోనే దేశఅభివృద్ధి సాధ్యమని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ధని, ఆలూర్ గ్రామాల్లో ఆయన పర్యటించి.. మాట్లాడారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత సీఎం నరేంద్ర మోదీకి దక్కిందన్నారు. జరగబోయే ఎన్నికల్లో బీజేపీ పార్టీని మూడోసారి దేశంలో అధికారంలోకి వచ్చేలా ప్రతిఒక్కరూ కృషిచేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ గౌడ్, కరిపే విలాస్, రాంశంకర్ రెడ్డి, వడ్డీ రాజేందర్ రెడ్డి, సహెబ్ రావు, రామ్‌రెడ్డి, ఉపాధిహామీ కూలీలు ఉన్నారు.

అల్లోల మెడలో కాంగ్రెస్ కండువా!

● ఊగిసలాట నడుమ ఎట్టకేలకు కాంగ్రెస్ గూటికి మాజీ మంత్రి ● ఇక నిర్మల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ వైకుంఠపాళి?
● నిర్మల్‌లో మారనున్న కాంగ్రెస్ ముఖచిత్రం ● శ్రీహరిరావు వర్గం అడ్డుకున్నా ఆగని చేరిక ● ఐకే రెడ్డి వర్గీయుల్లో కొత్త ఉత్సాహం



కాంగ్రెస్ పార్టీలో చేరిన అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్, మే1(ఆంధ్రజ్యోతి): నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్‌లో ఇక కొత్త పోరు మొదలుకానుంది. ఇన్నాళ్లూ నేడు రేపు అంటూ సాగుతూ వస్తున్న ఊగిసలాట అనంతరం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి బుధవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రాజకీయంగా గురుశిష్యులుగా పేరున్న మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ నేత శ్రీహరిరావు నడుమ కొనసాగుతూ వస్తున్న విభేదాల క్రమంలో కాంగ్రెస్ అధిష్ఠానం ఇంద్రకరణ్‌రెడ్డి చేరికకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు మారనున్నాయన్న సంకేతాలు వెలువడుతున్నాయి. బుధవారం బీఆర్‌ఎస్‌కు రాజీనామాచేసిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి రాత్రి తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పుకోవడం నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. ఇంతకాలం ఆయన చేరికను అడ్డుకుంటూ వస్తున్న శ్రీహరిరావువర్గీయులు ఈ పరిణామంతో నిరుత్సాహానికి గురికాగా కాంగ్రెస్‌లో చేరిన ఇంద్రకరణ్‌రెడ్డి వర్గీయుల్లో కొత్త ఉత్సాహం మొదలైంది.

ఎట్టకేలకు కాంగ్రెస్ గూటికి..

బీఆర్‌ఎస్‌లో రెండు పర్యాయాలు రెండుసార్లు మంత్రిగా పనిచేసి ఆ పార్టీలో ఇంద్రకరణ్‌రెడ్డి బలమైన నేతగా ఎదిగారు. మాజీ సీఎం కేసీఆర్‌కు అత్యంత సన్నిహితునిగా ఆయన పేరుపొందారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇంద్రకరణ్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు దూరంగా ఉంటున్నారు. పార్టీ అధిష్ఠానం ఇచ్చిన ఏ ఒక్క కార్యక్రమానికి ఆయన హాజరుకాలేదు. దీంతో ఆయన బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతారని ప్రచారం మొదలైంది. ఈ నేపథ్యంలో ఇంద్రకరణ్‌రెడ్డి చేరికను కాంగ్రెస్ పార్టీని నియోజకవర్గంలో నడుపుతున్న జిల్లాకాంగ్రెస్ అధ్యక్షులు శ్రీహరిరావు తీవ్రంగా అడ్డుకున్నారు. పార్టీ ఉనికి లేని సమయంలో తాను కాంగ్రెస్‌లో చేరి పార్టీ కోసం పని చేస్తే రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ఇంద్రకరణ్ రెడ్డిని ఎలా చేర్చుకుంటారని ఆయన అధిష్ఠానంపై ఒత్తిడి పెంచారు. దీంతో కొన్నాళ్లుగా ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిక వ్యవహారంపై జరుగుతున్న చర్చలో భాగంగా ఆయన చేరిక వాయిదా పడుతూ వస్తున్నది. ఒక సందర్భంలో శ్రీహరిరావు ఒత్తిడి మేరకు ఆయన చేరిక ఆగిపోయిందని కూడా ప్రచారం జరిగింది. కానీ పార్టీకి చెందిన సీనియర్ నేతలు జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రంగప్రవేశం చేసి ఇంద్రకరణ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి చేర్చేలా మంత్రాంగం నడిపినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయన బుధవారం సాయంత్రం గాంధీభవన్‌లో దీపాదాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నట్లు సమాచారం.

నిర్మల్ కాంగ్రెస్.. వైకుంఠపాళి..?

నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో కొత్త సమీకరణలు జరిగే అవకాశం కన్పిస్తోంది. రాజకీయంగా ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీహరిరావు నడుమ మొదటి నుంచి విభేదాలున్నాయి. వీరిద్దరిదీ గురుశిష్యుల బంధంగా రాజకీయ విశ్లేషకులు చెబుతుంటారు. గతంలో ఇంద్రకరణ్‌రెడ్డిని విభేదించి శ్రీహరిరావు గులాబీ పార్టీలో చేరారు. అనంతర కాలంలో ఇంద్రకరణ్‌రెడ్డి ఆ పార్టీలో చేరి శ్రీహరిరావు రాజకీయ భవిష్యత్‌ను దెబ్బకొట్టారు. మళ్లీ మరోసారి అదే పరిస్థితి నియోజకవర్గంలో ఎదురయ్యే అవకాశం ఉందని అంటున్నారు. ఇటీవలే ఇంద్రకరణ్‌రెడ్డితో పొసగని కారణంగా ఆయన బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎదిగారు. మళ్లీ ఇప్పుడు ఇంద్రకరణ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో శ్రీహరిరావుకు రాజకీయంగా ముప్పు జరుగుతుందని అంటున్నారు. వీరిద్దరి రాజకీయ భవితవ్యం నిచ్చెన పాము వైకుంఠపాళిలా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మారనున్న నిర్మల్ కాంగ్రెస్ రాజకీయం

కొన్నాళ్లు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతారని ప్రచారం జరుగుతుండగా శ్రీహరిరావు కారణంగా అడ్డంకి పడుతుందని, ఇక ఎన్నిచేసినా అల్లోల కాంగ్రెస్‌లో చేరడం కష్టమేనని చర్చసాగింది. ఈ క్రమంలో అల్లోల సన్నిహితులు అనేకమంది శ్రీహరిరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు. మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్, గ్రంథాలయ సంస్థచైర్మన్ రాజేందర్, మార్కెట్ ఛైర్మన్ చిలుక రమణ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ అప్పాల గణేష్, నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, సారంగాపూర్ మాజీఎయంసీ ఛైర్మన్ రాజ్ మహ్మద్, నిర్మల్ మాజీ ఎయంసీ ఛైర్మన్ దేవేందర్ రెడ్డితో సహా కొంతమంది ముఖ్య నేతలు కాంగ్రెస్‌లో చేరారు. గతంలో వీరంతా ఇంద్రకరణ్‌రెడ్డికి సన్నిహితంగా ఉన్నవారే. అయితే ఇంద్రకరణ్ రెడ్డి సైతం కాంగ్రెస్‌లోకి రావడంతో నేతల్లో భవిష్యత్ రాజకీయంపై ఆందోళన మొదలైనట్లు అంటున్నారు.

జైనథ్, బేల మండలాల్లో పర్యటించిన పార్లమెంట్ ఎన్నికల అధికారి

జైనథ్, మే 1: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని జైనథ్, బేల మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎలక్షన్ జనరల్ అబ్జర్వర్ రాజేంద్ర విజయ్ మండల రెవెన్యూ, పోలీసు అధికారులతో సందర్శించారు. ఈ సందర్భంగా జైనథ్‌లో గల అతిపురాతన ఆలయం శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బేల మండలకేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసి బేల మండలంలోని శంకర్‌గూడ చెక్‌పోస్టును తనిఖీ చేసి పలు సూచనలు, సలహాలను సిబ్బందికి అందజేశారు. ఇందులో జైనథ్ రూరల్ సీఐ డి.సాయినాథ్, బేల ఎస్సైరాధిక, జైనథ్ తహసీల్దార్ శ్యాంసుందర్, తదితరులున్నారు.

'తడి చెత్తతో సేంద్రియ ఎరువులను తయారు చేయాలి'

ఇంద్రవెల్లి, మే 1: తడి, పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తతో సేంద్రీయ ఎరువులు తయారు చేసి రైతులకు విక్రయించి గ్రామ పంచాయితీ ఆదాయం పెంపొందించుకోవాలని రాష్ట్ర పంచాయితీరాజ్ కమిషనర్ అనితా రామచంద్రన్ అన్నారు. బుధవారం మండలంలోని ముత్నూర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీ, డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హరితహారంలో నాటిన మొక్కలను తప్పనిసరిగా 85 శాతం సంరక్షించాలని సూచించారు. గ్రామాల్లో ప్రతిరోజు తడి, పొడి చెత్తను కంపోస్టు షెడ్డుకు తరలించాలని, తప్పకుండా తడి, పొడి చెత్తను వేరు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో సాయన్న, డీపీవో ఫణీంధర్‌రావు, ఎంపీడీవో కె.భాస్కర్, ఎంపీవో జీవన్‌రెడ్డి, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, పంచాయితీ ఈవో విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



తలమడుగు మండలంలో ఎండ వేడిమి తట్టుకోలేక నీటిమడుగులో సేద తీరుతున్న మూగజీవాలు



..మేకపిల్లలను ఎండ నుంచి కాపాడుకునేందుకు సంచారజాతుల వారు ఒంటెపై ఏర్పాటు చేసిన నీడ సౌకర్యం ఇలా..

బాబోయ్ ఇవేం ఎండలు!

● ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలో 43.9 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత
● తలమడుగులో మూగజీవాల విలవిల

ఆదిలాబాద్, మే 1(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో గత నాలుగైదు రోజులుగా తీవ్రమైన ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దంచికొడుతున్న ఎండలతో బాబోయ్ ఇవేం ఎండలు అంటూ జనాలు బెంబెలెత్తి పోతున్నారు. పగలంతా భానుడు భగభగలు, రాత్రులు తీవ్రమైన ఉక్కపోత కనిపిస్తుంది. బుధవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 42.8 డిగ్రీలు కాగా 26.2 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా భీంపూర్ మండలం అర్లి(టి)లో 43.9, బోథ్‌లో 43.1, బేలలో 42.9, జైనథ్‌లో 42.3, తలమడుగులో 41.8, బజార్‌హత్నూర్‌లో 41.0, తాంసిలో 40.9 అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా రికార్డు స్థాయిలో 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతల మాదిరిగానే కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా అమాంతంగా పెరుగుతున్నాయి. ఉష్ణోగ్రతల తీవ్రతతో జనం బయటకు వచ్చేందుకే జంకుతున్నారు. తప్పని సరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లోనే పనులు ముగించుకుని మధ్యాహ్నం సమయంలో ఇంటికే పరిమితమవుతున్నారు. ఎండల తీవ్రతకు ఉపాధి కూలీల హాజరు శాతం కూడా భారీగా పడిపోతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

మూగజీవాల విలవిల

తలమడుగు: రోజురోజుకు మరింత ఎండలో పెరగడంతో మనుషులే కాదు.. మూగ జీవులు కూడా విల విలలాడుతున్నాయి. తలమడుగు మండలంలో మూగ జీవులైన మేక పిల్లలకు ఎండ నుంచి ఉపశమనం కల్పించేందుకు సంచార జీవులు ఒంటెపై నీడ సౌకర్యం ఏర్పాటు చేసి వాటికి ఎండ తగలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వారు కాలినడకన వెళ్తుంటారు. కానీ మూగ జీవులైన మేక పిల్లలకు, ఎండ భారీ నుంచి కాపాడుకోడానికి ఏర్పాటు చేశారు. భానుడి భగభగను తట్టుకోలేక గేదెలు సైతం నీటిమడుగులో సేద తీరుతున్నాయి. మూగ జీవులకు ఎండల భారీన కాపాడుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. రైతులు, ఉపాధి కూలీలు కూడా ఉదయం పనులు ముగించుకోవాలని అధికారులు సూచనలు అందిస్తున్నారు.



ఆదిలాబాద్‌లో మిట్టమధ్యాహ్నం నిర్మానుష్యంగా మారిన అంబేద్కర్‌చౌక్

లేబర్ కోడ్‌ల రద్దు కోసం పోరాడుదాం

● సీఐటీయూ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న ● అంతటా మే డే వేడుకలు ● పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు



ఇచ్చోడలో మే డే వేడుకలు నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

తలమడుగు, మే 1: భారతదేశ కార్మికవర్గం అనేక త్యాగాల ద్వారా పోరాటాల ద్వారా సాధించిన 44 కార్మిక చట్టాలను కార్పొరేట్లకు కంపెనీల యజమానులకు చుట్టాలుగా మార్చి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకువచ్చి 8గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచి కార్మికులను దోపిడీ చేసేలా వెట్టిచాకిరి బానిసలుగా మారేలా విధానాలను రూపొందించిన బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో కార్మిక వర్గం ఓడించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న అన్నారు.బుధవారం మండలంలో మేడే సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ కార్మిక వర్గం రైతాంగం నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు దారతత్తం చేస్తున్నారు. ఇందులో ఆత్రంకిష్టన్న, కళావతి, మంజుల, రమణ, గంగమ్మ, కృష్ణ, గంగన్న, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: బుధవారం మండలంలోని ఆయా గ్రామాల్లో మే డే వేడుకలను కార్మిక సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు.

బజార్‌హత్నూర్: మండలకేంద్రంలో సిఐటియు, ఆధ్వర్యంలో కార్మికులు మే డే వేడుకలను గణంగా నిర్వహించారు. సిఐటియూ మండల అధ్యక్షుడు తడ్క శ్రీనివాస్ సిఐటియూ జెండాను ఆవిశ్కరించి వేడుకలను ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దేవేందర్, జిల్లా సభ్యుడు సురేష్, గ్రామపంచాయతీ కార్మికులు, హమాలి కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: హక్కుల సాధన కోసం కార్మికులంత ఏకం కావాలని సీఐటియు, ఏఐటీయూసీ, నాయకులు న్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలో మేడే వేడుకలను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాయకులు జెండాను ఆవిశ్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నయ్య, కార్యదర్శి పవార్ జితేంద్ర, సుభాష్, భూమయ్య, లింగయ్య, సురేష్, తదితరులు పాల్నొన్నారు.

బోథ్: మేడే కార్మిక దినోత్సవం సందర్భంగా మండలంలో కార్మిక దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. మండలంలోని కౌటా(బి) గ్రామంలో తాపీ మేస్త్రీ, ఆటో యూనియన్, హమాలీలు మే డే వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తాపీ మేస్త్రీల సంఘఀఅ అధ్యక్షులు అరెల్లి రాజారెడ్డి పాల్గొన్నారు. బోథ్ మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అబుదు లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు అనిల్ కుమార్‌లు పాల్గొనగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బోథ్ బస్టాండ్ వద్ద కార్మిక జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండలకేంద్రంతో పాటు మండలంలోని ముత్నూర్, దన్నోరా గ్రామాల్లో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ యూనియన్ వర్కర్లు, తాపీ మేస్త్రీ యూనియన్ కార్మికులు, గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న వర్కర్లు మే డే ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌక్ వద్ద ఏఐటీయూసీ తాపీ మేస్త్రీలు, అంగన్‌వాడీ టీచర్లు జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తాపీ మేస్త్రీ కార్మికులు మడావి నగేష్, రవి, రమేష్, శ్రావణ్‌రెడ్డి, సంతోష్, తదితరులు ఉన్నారు.

భీంపూర్: మండలకేంద్రంలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు ధోని పెల్లి వెంకటమ్మ, సీఐటీయూ కార్యదర్శి ధోని పెల్లి స్వామి, అంగన్‌వాడీలతో కలిసి మే డే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వామి మాట్లాడుతూ లేబర్ కోడ్ రద్దుకై, కార్మిక చట్టాల పునరుద్ధరణకై పోరాడదాం అని పిలుపునిచ్చారు. కార్మిక కర్షక ఐక్యత వర్ధిల్లాలి అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు మీరాబాయి, గంగుబాయి, సుజాత, నాయకులు ఇంద్రజీ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం మే డే వేడుకలను కార్మికులు ఘనంగా జరుపుకున్నారు. ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు మోహితే మారుతి, ఉమకాంత్, అజీమ్, సుంకే రమేష్, ఉస్మాన్, మహేందర్, జాకీర్, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో ఉపాధి హామీ కూలీ మృతి

బోథ్, మే 1: మండలంలోని పరుపులపల్లి గ్రామానికి చెందిన ఆత్రం జంగు(45) అనే వ్యక్తి బుధవారం వడదెబ్బకు గురై మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. బుధవారం మృతుడు ఉపాధి హామీ పనికి వెళ్లి తిరిగి ఇంటికి రాగానే అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. తీవ్రమైన ఎండల కారణంగా ఉపాధిహామీ కూలీల ఎండ నుంచి కాపాడుకునేందుకు రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని కూలీలు కోరుతున్నారు. పని స్థలాల్లో తాగునీటి వసతితో పాటు టెంట్‌లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

నేరడిగొండ, మే 1: మండలంలోని లింగట్ల గ్రామానికి చెందిన రాథోడ్ మహేందర్ (25) బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. రాథోడ్ మహేందర్ ఆదిలాబాద్ రిమ్స్‌లో విధులు ముగించుకొని తిరిగి వచ్చే క్రమంలో మండలంలోని బుర్కపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మహేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి గతనెల 21న వివాహం జరిగింది. కాళ్లకు పసుపు పారాణి ఆరకముందే రోడ్డు ప్రమాదంలో మృత్యువు రావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ మేదరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 42.8 : కనిష్ఠం 26.2
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
గురువారం 2 మే 2024





సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖాధికారులు

వేసవిలో నిరంతరంగా విద్యుత్‌ను సరఫరా చేయాలి : డైరెక్టర్

ఆదిలాబాద్, మే 1(ఆంధ్రజ్యోతి): వేసవి పరిస్థితుల నేపథ్యంలో నిరంతరంగా విద్యుత్‌ను సరఫరా చేయాలని డైరెక్టర్ ఆపరేషన్ మోహన్‌రావు అన్నారు. బుధవారం జైనథ్, బేల మండలాల్లో విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్‌తో కలిసి క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలకు నిరంతరంగా విద్యుత్‌ను సరఫరా చేస్తూ మెరుగైన సేవలను అందించాలన్నారు. ప్రజా ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ పకడ్బందీగా చేపట్టాలన్నారు. లూజు వైర్లను సరిచేసి వేలాడే కొమ్మలను తొలగించి విద్యుత్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి పరిస్థితులతో ఎలాంటి కరెంట్ కోతలు లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు సబ్‌స్టేషన్లను సందర్శించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఆయన వెంట డీఈలు ప్రభాకర్, హరికృష్ణ, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.



- జిల్లాలో సీనియర్ నేతల రీఎంట్రీపై భగ్గుమంటున్న కంది వర్గం
- ఆ నలుగురిని పార్టీలో చేర్చుకోవద్దు అంటూ ధర్నాలు, నిరసనలు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రికి సమాచారం లేకపోవడంపై ఆగ్రహం
- పార్టీలో ఆధిపత్యం కోసం పార్టీ నేతల ఆరాటం
- పార్లమెంట్ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో ముదురుతున్న విభేదాలు

ఆదిలాబాద్, మే 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో జిల్లా సీనియర్ నేతల చేరికపై రగడ మొదలయ్యింది. ఆ నలుగురు నేతలు పార్టీలోకి తిరిగి రావడం కొత్త వివాదానికి దారి తీస్తోంది. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నా.. స్థానిక నేతల మధ్య విభేదాలు అధిష్ఠానం పెద్దలకు ఇబ్బందికరంగా మారాయి. గత కొద్ది రోజులుగా కాంగ్రెస్‌లోకి జోరుగా వలసలు కొనసాగుతున్నాయి. అయితే పార్టీలోకి కొత్త నేతల రాకపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఆదిలాబాద్ నియోజకవర్గంలో సస్పెన్షన్‌కు గురైన ముగ్గురు సీనియర్ నేతలు.. తిరిగి పార్టీలో చేరడంపై కాంగ్రెస్‌లో లొల్లి మొదలయ్యింది. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన నేతల మధ్య సమన్వయం కుదిరినట్లు కనిపించడం లేదు. జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడి ఓడిన కాంగ్రెస్.. పార్లమెంట్ ఎన్నికలను సీరియస్‌గానే తీసుకుంటోంది. ఎలాగైనా ఈ సారి ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని గెలిచి తీరాలనే పట్టుతో కనిపిస్తోంది. గత నెల రోజుల క్రితం డీసీసీ మాజీ అధ్యక్షుడు భార్గవ్‌దేశ్ పాండేపై సస్పెన్షన్‌ను ఎత్తి వేయడం చర్చనీయాంశంగా మారింది. ఆ వెనువెంటనే ఆయనపై సస్పెన్షన్ కొనసాగిస్తున్నట్లు పేర్కొంటూ కాంగ్రెస్ యూ టర్న్ తీసుకోవడం కలకలం రేపింది. మళ్లీ తాజాగా సీనియర్ నేతలు గండ్రత్ సుజాత, సాజిద్‌ఖాన్, సంజీవ్‌రెడ్డిలు పార్టీలో చేరడంపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భగ్గుమంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి ద్రోహం చేసిన ఆ నలుగురు నేతలను పార్టీలో చేర్చుకోవద్దంటూ డిమాండ్ చేస్తున్నారు. పార్టీ కండువా వేసుకున్న గంటల వ్యవధిలోనే జిల్లాకేంద్రంలో సీనియర్ నేతల దిష్టిబొమ్మ ఫ్లెక్సీని దహనం చేసి ఆందోళనకు దిగారు. నోటికి నల్లగుడ్డలు కట్టుకుని.. ఆ నలుగురు నేతలను పార్టీలోకి తీసుకోవద్దంటూ నిరసన వ్యక్తం చేశారు. గత కొద్ది రోజులుగా పార్టీలోకి వలసలు కొనసాగుతున్న ఎలాంటి ఆందోళనలు, నిరసనలు కనిపించ లేదు. కానీ సీనియర్ నేతల చేరికలతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగడం అధిష్ఠానం పెద్దలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అయితే పార్లమెంట్ ఎన్నికలకు ముందు పార్టీ నేతల మధ్య తీవ్ర విభేదాలు గందరగోళ పరిస్థితులకు దారి తీస్తున్నాయి.

ఆ నలుగురు వద్దే వద్దు

అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ టికెట్ కోసం నేతలంతా ప్రయత్నాలు చేయగా.. కంది శ్రీనివాస్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించింది.



- జిల్లాకేంద్రంలో సీనియర్ నేతల ఫ్లెక్సీని దహనం చేస్తూ ఆందోళనకు దిగిన కాంగ్రెస్ శ్రేణులు

దీంతో సీనియర్ నేతలైనా గండ్రత్ సుజాత, సాజిద్‌ఖాన్, సంజీవ్‌రెడ్డి, భార్గవ్‌దేశ్ పాండేలు ఓ వర్గంగా ఏర్పడి కాంగ్రెస్‌తో తాడోపేడో తేల్చుకునేందుకు ఎన్నికల బరిలో నిలిచారు. కంది శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ ఇవ్వడంపై పార్టీ నిర్ణయాన్ని తప్పుబడుతూ తీవ్ర విమర్శలు చేశారు. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఈ ముగ్గురు నేతలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ ఆరేళ్ల పాటు సస్పెన్షన్ వేటు వేసింది. అప్పటి నుంచి పార్టీకి దూరంగానే ఉంటూ వస్తున్నారు. ఎవరూ ఊహించని విధంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో నేతలు మళ్లీ పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. అనుకున్నట్లుగానే మంగళవారం జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ముగ్గురు నేతలు మళ్లీ కండువా కప్పుకోవడంతో కాంగ్రెస్‌లో కలకలం రేపుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి ద్రోహం చేసిన ఆ నలుగురు నేతలు వద్దే వద్దంటూ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి వర్గం గట్టిగా పట్టుబడుతోంది. ఆ నేతలపై ఆరేళ్ల పాటు సస్పెన్షన్ కొనసాగించాలంటూ అధిష్ఠానంపై ఒత్తిడి చేసే ప్రయత్నం చేస్తున్నారు.

మంత్రి సీతక్క ఆగ్రహం

ఆదిలాబాద్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేతల చేరికపై ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు కనీస సమాచారం లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై మంత్రి సీతక్క అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఇన్‌చార్జి మంత్రిని కాదని జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ నేతలు పార్టీలో చేరడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ విషయమై మంత్రి సీతక్క హుటాహుటిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసేందుకు హైదరాబాద్ బయలుదేరి వెళ్లినట్లు తెలుస్తుంది. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని గెలిపించేందుకు గత కొద్దిరోజులుగా సీతక్క తీవ్రప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో మండిపోతున్న ఎండలను కూడా లెక్కచేయకుండా పార్టీ అభ్యర్థిని వెంటేసుకుని విస్తృత ప్రచారాన్ని చేపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి అండగా నిలిచిన అభ్యర్థుల నిర్ణయమే ఫైనల్ అని చెబుతూనే కొందరు సీనియర్ నేతలు ఇష్టా రాజ్యంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు. గతంలో ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్‌జనార్ధన్ పార్టీలో చేరేందుకు సిద్ధమైన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అభ్యంతరం చెప్పడంతో ఆయన చేరిక నిలిచిపోయింది. తాజాగా సీనియర్ నేతల చేరికపై ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అభ్యంతరం చెప్పినా.. ఇదేమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

ముందు నుంచే వర్గపోరు

కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య ముందు నుంచే వర్గపోరు కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల వరకు అంతా ప్రశాంతంగానే కనిపించినా.. ఆ తర్వాతనే నేతల మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. పార్టీ అభ్యర్థి ఓటమికి పలురకాల ప్రయత్నాలు చేయడంతో పార్టీ అధిష్ఠానం కూడా తీవ్రంగా పరిగణించింది. అప్పటి నుంచి నేతల మధ్య విభేదాలు అందనంత దూరం చేరాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ నిర్ణయాన్ని తప్పుబట్టి సీనియర్ నేతలు పెద్ద తప్పిదమే చేశారు. దీంతో సీనియర్ నేతల రాజకీయ భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారింది. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే పార్టీ అభ్యర్థి గెలిచే అవకాశాలు కూడా ఉండేవి. ఒంటెద్దు పోకడలతో పార్టీ నిర్ణయాన్ని తప్పుబట్టిన సీనియర్లు ఇప్పుడు పార్టీ ముందు తలొంచుకునే పరిస్థితి ఏర్పడింది. ఎన్నికలకు ముందే కంది శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరి టికెట్ దక్కించుకున్న కష్టాల్లో ఉన్న పార్టీకి అండగా నిలిచాడు. ఏది ఏమైనా పార్టీ అధికారంలోకి రావడంతో నేతలంతా మళ్లీ ఒకే గూటికి చేరేందుకు ప్రయత్నాలు చేయడం కాంగ్రెస్‌లో వివాదాలకు కారణమవుతోంది.



నోటికి నల్లగుడ్డలు కట్టుకుని నిరసన తెలుపుతున్న నాయకులు

సస్పెండైన నేతలను తిరిగి తీసుకోవడం సరికాదు : కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, మే 1: సస్పెండ్ చేసిన నేతలను తిరిగి తీసుకోవడం సరికాదని, వారిపై ఉన్న ఆరేండ్ల సస్పెన్షన్‌ను కొనసాగించాలని లేని పక్షంలో తాము మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. సాజిద్ ఖాన్, గండ్రత్ సుజాత, సంజీవ్‌రెడ్డిల సస్పెన్షన్ ఎత్తివేయడాన్ని నిరసిస్తూ బుధవారం కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి రాజీనామా చేసి రెబల్‌గా కంది శ్రీనివాస్‌ను ఓడించడానికి పోటీ చేశారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మళ్లీ పార్టీలో చేరేందుకు చూస్తున్నారన్నారు. అధిష్ఠానం కూడా వారిపై ఉన్న ఆరేళ్ల సస్పెన్షన్‌ను కొనసాగించాలన్నారు. ఎంపీ అభ్యర్థి తరపున ప్రచారాన్ని కూడా నిలిపి వేశామన్నారు. అధిష్ఠానం నిర్ణయం మార్చుకోకుంటే మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గిమ్మా సంతోష్, మంచికట్ల ఆశమ్మ, ఉయిక ఇందిరా, మల్లారెడ్డి, షకీల్, జాఫర్, సిరాజొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కవి జయరాజ్

మతోన్మాద శక్తుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకుందాం : జయరాజ్

ఆదిలాబాద్, మే 1(ఆంధ్రజ్యోతి): దేశంలో చెలరేగి పోతున్న మతోన్మాద శక్తుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని ప్రకృతి కవి, ప్రజా వాగ్గేయకారుడు జయరాజ్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన అలుపెరగని పోరాటం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రశ్నించే గొంతుకలు, ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయ రచయితలు, జర్నలిస్టుల పై కొనసాగుతున్న ప్రభుత్వ నిర్బంధాలను తిప్పికొట్టాలన్నారు. ప్రముఖ జర్నలిస్టు గౌరీలంకేశ్‌ను పట్టుకుని చంపారని అన్నారు. ప్రజా పోరాటాలకు మద్దతునివ్వడం, రైతు పోరాటాలను ప్రపంచానికి పరిచయం చేయడం వల్లనే నివ్స్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్‌పురకాయస్థను అరెస్టు చేసి నిర్బంధించడం సరికాదన్నారు. ఆర్థికపరమైన నేరాలు రుజువు కానప్పటికి ఆయన నిర్బంధాన్ని ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. ప్రశ్నించే గొంతుకలకు ప్రజలందరు అండగా నిలవాలని కోరారు. ప్రజాహక్కులు కాపాడడం కోసం కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు, జర్నలిస్టులు కృషి చేయాలన్నారు. దేవుడి పేరిటా ఓట్లు అడిగేందుకు పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయని అన్నారు. సత్యాన్ని బోధించడమే సరికొత్త విప్లవమని పేర్కొన్నారు. హిందువుల పేరిటా ఓ వర్గం నేతలు దేశాన్ని పాలించాలని ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి మతతత్వ పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ ఓరగంటి అశోక్, టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, ఐక్య వేదిక నాయకులు కిరణ్, సచిన్, సురేష్, మల్లేష్; కవులు, కళాకారులు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం



మహేందర్ ఇంటి ఆవరణలో పూచిన మే పుష్పం

ఇచ్చోడలో వికసించిన మే పుష్పం

ఇచ్చోడ, మే 1: ఏడాదికోసారి పూసే అరుదైన మే పుష్పం వికసించింది. ప్రతి ఏటా తీవ్ర ఎండలలో మే నెలలో పుష్పించే మే పుష్పం ఈనెల 1వ తారీఖునే పూసింది. మండలకేంద్రానికి చెందిన ముక్కావార్ మహేందర్ అనేవ్యాపారి ఇంటి ఆవరణలో ఉన్న గార్డెన్‌లో మే ఒకటినే మే పుష్పం వికసించింది. అందమైన ఈ పుష్పం ప్రకృతి ప్రేమికులతో పాటు చూపరులను ఆకట్టుకుంటోంది. మండే ఎండలో వికసించే అరుదైన ఈ పుష్పం మే నెలలోనే పూయడం గమనార్హం.

'ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి'

తలమడుగు, మే 1: ఈనెల 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అర్హులైన ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరికి ఇంటింటికీ వెళ్లి ఓటరు స్లిప్పులను అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 28 గ్రామాలలో 85శాతం ఓటర్ స్లిప్పులను అందించడం జరిగిందన్నారు. ఇందులో బీఎల్‌వోలు కృష్ణయ్య, కాడే చినబాబు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో..

పీవో, ఏపీవోల పాత్ర ఎంతో కీలకం

- జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షిషా
- జిల్లాకేంద్రంలో పార్లమెంట్ నియోజకవర్గ పీవో, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షిషా



పాల్గొన్న పీవోలు, ఏపీవోలు

ఆదిలాబాద్ అర్బన్, మే 1: ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం పార్లమెంట్ నియోజకవర్గం పీవో, ఏపీవోలకు స్థానిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పీవో, ఏపీవో, ఓపీల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పోలింగ్ రోజు, పోలింగ్ ముందు రోజు ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఈవీఎం మెషిన్‌లను, మాక్‌పోల్, పీఓ డైరీ, 7ఏ, 7సీ, బుక్‌లెట్ సరిగా నింపి ఎన్నికలను విజయవంతం చేయాలని సూచించారు. పోలింగ్ రోజు ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ మొదలు పెట్టాలని, రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్ రాకుంటే 15 నిమిషాలు వేచి చూసి కచ్చితంగా ఉదయం 5.45 గంటలకు మాక్ పోలింగ్ ప్రారంభించాలని, ఎలాంటి తప్పులు లేకుండా ఎన్నికల నిర్వహణ పూర్తి చేయాలన్నారు. ప్రతీ శిక్షణ గదిలో ఎన్నికల మెటీరియల్స్, పోస్టల్ బ్యాలెట్ కవర్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, శిక్షణ సమయంలో పోలింగ్ సిబ్బంది వాటిపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. 7 అసెంబ్లీ సెగ్మెంట్‌ల వీఎఫ్‌సీ స్థానాలను కమ్యూనికేట్ చేసి తేదీలు, సమయాలను స్పష్టం తెలపాలని పేర్కొన్నారు. ఉద్యోగులు మాత్రమే ఓటరుగా నమోదు చేసుకున్న సంబంధిత ఏఎస్ఎస్ వీఎఫ్‌సీలలో ఓటు వేయడానికి 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఉద్యోగులందరికీ వారు ఎంచుకున్న ఎంపిక ప్రకారం ఓటు వేయాలని స్పష్టం చేశారు. ఇందులో ఆర్డీవో వినోద్ కుమార్, ఎన్నికల సిబ్బంది, తదితరులున్నారు.

'ఎన్నికల వ్యయ ఖాతాలను నిర్ణీత ప్రొఫార్మలో పొందుపరచాలి'

ఆదిలాబాద్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికలు 2024లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి కచ్చితంగా వారి ఖర్చులకు సంబంధించిన అకౌంట్లను భారత ప్రజా ప్రాతినిథ్య చట్టం 1951లోని సెక్షన్ 77 ప్రకారం ప్రతి అభ్యర్థి తాను చేయబడిన ఎన్నికల వ్యయ ఖాతాలను నిర్ణీత ప్రొఫార్మా పుస్తకంలో పొందుపర్చాలని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షిషా అన్నారు. అలాగే భారత ఎన్నికల కమిషనర్ ద్వారా నియమించబడిన వ్యయ పరిశీలకుల ద్వారా తనిఖీ చేయించాలని, అభ్యర్థి కానీ, లేక అతని ద్వారా నియమించబడిన ఏజెంట్ ద్వారా కాని నిర్దేశించిన పుస్తకంలో తమ రోజు వారి ఖర్చులను విధిగా తనిఖీ చేయించాలని తెలిపారు. వ్యయ పరిశీలన కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడత ఈనెల 2, 6, 10వ తేదీలలో న ఉదయం 10గంటల నుంచి తనిఖీ పూర్తయ్యే వరకు ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు కానీ, వారి ఎన్నికల ఏజెంట్ల ద్వారా కాని వారి రోజు వారి ఖర్చులకు సంబంధించిన అకౌంట్లను పైన నిర్దేశించిన తేదీలలో పంపి తమ తమ అకౌంట్లను తనిఖీ చేయించాలని కోరారు. నిర్దేశించిన తేదీలలో హాజరు కాని యెడల ఐపీసీ సెక్షన్ 171(1) ప్రకారంగా ఎఫ్ఐఆర్ సంబంధిత కోర్టులో ఫైల్ చేయడం జరుగుతుందని తెలిపారు.

జిల్లాలో ఘనంగా మే డే

- ఎర్ర జెండాను ఎగురవేసి వేడుకలను జరుపుకున్న కార్మిక సంఘాలు
- పాల్గొన్న సీపీఐ, సీపీఎం,ఆయా పార్టీల నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, మే 1: మే డే వేడుకలను స్థానిక ఆర్టీసీ డిపోలో ఎస్‌డబ్ల్యూఎఫ్ సంఘం ఆధ్వర్యంలో కార్మికుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మిట్టపెల్లి భీమ్‌రావులు హాజరయ్యారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి భీమ్‌రావు మాట్లాడుతూ ఎందరో మహానుభావులు కార్మిక నాయకుల త్యాగాల ఫలితంగానే నేడు కార్మికులు 8గంటల పని దినాన్ని అనుభవిస్తున్నారని తెలిపారు. కానీ ఆర్టీసీలో మాత్రం దానికి భిన్నమైన పరిస్థితులు ఉన్నాయని, ఒకపక్క కార్మిక సంఘాలను నిషేధించి కార్మికుల సమస్యలను, హక్కులను అడిగేవారు లేకుండా యాజమాన్యం చేసిందన్నారు. సంస్థలో సంఘాలు లేవని, అధికారులు తమ ఇష్టారీతిగా కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం ఎస్‌డబ్ల్యూఎఫ్, సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటానికి ముందు ఉంటామన్నారు. అనంతరం డిపోలో మేడే జెండాను అనిత, ఎం.నారాయణ, తదితరులు ఆవిష్కరించారు. అలాగే కార్మిక, ప్రజా కర్షక వ్యతిరేక విధానాలు అవలంభిస్తు, లేబర్‌కోడ్‌ల రద్దుకై 8గంటల పని దినం పునరుద్ధరకు పోరాడుదామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని అగ్రికల్చర్ రిసెర్చ్ స్టేషన్, రిమ్స్, మున్సిపల్, సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని హాజరై మాట్లాడారు. లేబర్ కోడ్‌ల రద్దుకు అమర వీరుల స్ఫూర్తితో కార్మికవర్గం పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు.

అలాగే, పదేళ్ల బీజేపీ పాలనలో కార్మికులకు కార్పొరేట్ రంగాలకు ఉపయోగపడేలా చట్టాలు, ఇతర కార్యక్రమాలు చేపట్టిందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. మే డే సందర్భంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం నేతాజీ చౌక్‌లో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అలాగే, అమెరికా చికాగో నగరంలో పుట్టిన ఎర్ర జెండా నేడు కార్మికుల హక్కుల కోసం ఉద్యమిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సీపీఐ పార్టీ కార్యాలయంలో బుధవారం 138వ మేడేను పురస్కరించుకొని పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అలాగే, 1886లో అమెరికా చికాగో నగరంలో జరిగిన పోరాట ఫలితంగా ఎనిమిది గంటల పని దినాలు సాధించామని, దేశంలో మాత్రం అమలు కావడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. బుధవారం మే డేను పురస్కరించుకుని పార్టీ ఆధ్వర్యంలో సుందరయ్య భవనంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో మోదీ ప్రభుత్వ హయాంలో యజమానులకు అనుకూలంగా 12గంటల పని దినం కొనసాగుతోందన్నారు. పోరాడి సాధించిన చట్టాలను కూడా వారికి అనుకూలంగా మార్చుకున్నారని ఆరోపించారు. కార్మికులపై నిర్లక్ష్యం వహిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు కార్మికులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు.



జిల్లాకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి దరవాల మల్లేష్

గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో..

ఉట్నూర్: మండలంలో బుధవారం మేడే వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మండలకేంద్రంలోని కేబీ కాంప్లెక్స్, అంగడిబజార్, ఎన్‌ఆర్ నగర్, పాత ఉట్నూర్, కొత్త బస్టాండ్, ఐటీడీఏ చౌరస్తా, తెలంగాణచౌక్, నవోదయనగర్, హనుమాన్‌నగర్, పాత బస్టాండ్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో మేడే జెండాలను ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతావత్ రాందాస్ మాట్లాడారు. అలాగే, కేంద్రం 12గంటల పని విధానం తీసుకువచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను మానుకోవాలని టీపీజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఎర్ర జెండాను ఆవిష్కరణ చేశారు. ఇందులో సీఐటీయూ నాయకులు ఆనంద్, రత్నమాల, నైతంశోభ, నర్మద, శ్రీను, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన, ఆశా కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో ఎర్ర జెండాను ఎగరవేస్తున్న గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతావత్ రాందాస్